క్లుప్తంగా

నేడు రుణ మేళా

ఫిరంగిపురం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని గ్రామాల వారీగా రుణ మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓబీఎంఎంఎస్, ఈడబ్ల్యూ ఎస్, ఈబీసీల సబ్సిడీ రుణాలకు నమోదుచేసుకున్న లబ్ధిదారుల ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల మేనేజర్లు మేళాకు హాజరవుతారని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు హాజరు కావాలని తెలిపారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగించుకోవాలి



ఫిరంగిపురం: ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రవిబాబు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి తక్కెళ్లపాడు, యర్రగుంట్లపాడు, బేతపూడి, నుదురుపాడు, వేములూరిపాడు, ఫిరంగిపురం-3 సచివాలయ పరిధిలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. శుక్రవారం ఫిరంగిపురం-3లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఆధార్ లేనివారు, ఆధార్ అడ్రస్, ఇంటి పేరు మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఏలు గణేష్ భార్గవ్, నాగరాజు, ఎం.అన్నాయవజస్వ మాలిక, ఎస్.విజయభాస్కర్, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

కోర్టులు తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులతో కలసి ఆయన ప్రారంభించారు. ఎన్నికల ముందు నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఎం.ఆశీర్వాదం, బి. నవనీతం, ఇమాంబి, గురవయ్య, దానయ్య, హగ్గయ్య, దుర్గాభవాని, ఎం. సుబ్బారావు, శివకుమారి, దుర్గాభవాని పాల్గొన్నారు.

మహంకాళీ దేవస్థానం కానుకల లెక్కింపు

దుగ్గిరాల: అమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. కంఠంరాజుకొండూరులో గ్రామంలోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో గురువారం దేవదాయ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వర్లు, ధర్మకర్త డి.రంగప్రసాద్, దేవస్థాన సిబ్బంది, అర్చక స్వాములు పాల్గొన్నారు. కానుకలు మెత్తం రూ.13,34,446ల ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణ అధికారి కె.సునీల్ కుమార్ తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్ : ట్రూప్ చార్జీలను నిరసిస్తూ శుక్రవారం ఉదయం 9 గంటలకు నులకపేటలోని విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ట్రూ అప్ చార్జీలను కూటమి ప్రభుత్వం అమలు జరుపుతుండడం దారుణమని పేర్కొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

మేడికొండూరు: పేరేచర్లలోగల ఇంటెల్ పబ్లిక్ స్కూల్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. గురువారం విద్యార్థులకు సర్టిఫికెట్స్, బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ కోనూరి అశోక రాణి జయకుమార్, డైరెక్టర్ కోనూరి జయకుమార్ పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించినట్లు తెలిపారు. ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందించారు. సైన్స్ ఉపాధ్యాయురాలు షేక్ జైబూన్, విజయలక్ష్మి, హుస్సేన్, పారుపల్లి రమేష్, పేస్ సొసైటీ సెక్రటరీ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

కఠోర దీక్ష.. ఆరోగ్యానికి రక్ష

- పవిత్రం రంజాన్ మాసం
- 'రోజా' కు ఎంతో ప్రాధాన్యం
- ఉపవాస దీక్షలతో శరీర ప్రక్షాళన
- నమాజ్‌తో శారీక వ్యాయామం



అల్పాహారం తీసుకుంటున్న చిన్నారులు



విద్యుత్ కాంతులీనుతున్న పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న జామియా మసీదు



నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

మంగళగిరి: ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసం. నమాజ్‌తో దైవ ధ్యానం, రోజా (ఉపవాసం)వారి దినచర్య. ఆకలి, దప్పికల్ని ఓర్చడం, వ్యసనాలు వీడడం, ప్రశాంతంగా గడపడం ఈ మాసం ప్రధాన లక్ష్యం. ఇలా చేయడం వల్ల పరోక్షంగా శరీరానికి మేలు జరుగుతుంది. రుగ్మతలు తొలగిపోతాయి. ఆరాధనా భాగ్యంతో పాటు ఆరోగ్య యోగం కూడా లభించి ఆనందాన్ని, సంతృప్తిని మిగుల్చుతుంది. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రస్తుతం నడుస్తుండగా ఈ నెల 31న ఉపవాసం ముగుస్తుంది. పిల్లలు మినహా ముస్లిం స్త్రీ, పురుషులంతా 30 రోజుల పాటు రోజా(ఉపవాసం) ఉండటాన్ని విధిగా భావిస్తారు. వేకువజామునే నిద్ర లేచి, స్నానమాచరించి, అల్పాహారం (సెహరీ)తీసుకోవడం ద్వారా రోజా చేపడతారు. సాయంత్రం సూర్యాస్తమయం వరకు కఠోర ఉపవాస దీక్ష చేస్తారు.

ఎలాంటి ఆహారం, పానీయాలు స్వీకరించరు. సాయంత్రం ఇఫ్తార్(ఏదైనా ఆహారం స్వీకరించడం) ద్వారా రోజాను ముగిస్తారు. నియోజకవర్గంలో 70కు పైగా మసీదులున్నాయి. రంజాన్ మాసంలో(పాంచీవ్ ఖత్) ఐదు పూటలా నమాజ్ చేస్తారు. దీక్ష చేసినన్ని రోజులు చెడు వ్యసనాలకు దూరంగా వుంటారు. ముఖ్యంగా రంజాన్ మాసం దీక్షలతో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండడం అదే అలవాటు కావడంతో వారి జీవితం సన్మార్గంలోకి వెళ్తుంది.

మానసిక ఉల్లాసం



రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాసం ఉంటే శారీరకంగా, మానసికంగా ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. అల్లాను మనసులో ఉంచుకుని ఉపవాసం ఉండాలి. అప్పుడే ఉపవాస దీక్ష ఉపయోగకరం.

– షేక్ యుదుల్లా, మంగళగిరి

వ్యసనాలకు దూరం



రంజాన్ ఉపవాస దీక్ష ఎంతో కఠినతరం. దీక్ష చేసే వాళ్లు అల్లాను మనసులో స్మరించుకుంటూ ఏకాగ్రతతో దీక్ష చేయాలి. రంజాన్ ఉపవాస దీక్షతో యువత చెడు వ్యసనాలకు దూరమవుతారు. వారిలో మార్పు వస్తుంది.

– షేక్ అబ్దిలి, మంగళగిరి

ఏకాగ్రత పెరుగుతుంది



ఎంతో కఠినంగా ఉపవాస దీక్ష అల్లాను స్మరించుకుంటూ చేయాలి. ఐదు పూటలా నమాజ్ చేయాలి. రంజాన్ ఉపవాస దీక్షలతో మానసికంగా ఏకాగ్రత పెంపొందుతుంది. దీని వల్ల పనులపై ఏకాగ్రతతో పెరిగి, విజయం సాధిస్తారు.

– ఎండీ ఫిరోజ్, మంగళగిరి

కేఎల్‌యూలో టెక్ ఎక్స్‌పో-2025 పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు టెక్ ఎక్స్‌పో -2025 నిర్వహిస్తున్నట్లు ప్రో వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యాధునిక ఐఓటీ సాంకేతికతను ఉపయోగించి, వాస్తవ ప్రపంచ సవాళ్లను నెరవేర్చుకోవడానికి, సహకరించడానికి, పరిష్కరించడానికి యువ ఆవిష్కర్తల కోసం ఏర్పాటు చేస్తున్న డైనమిక్ ప్లాట్‌ఫాం ఈ ఎక్స్‌పో అని తెలిపారు. శుక్ర, శనివారాల్లో దీనిని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అభ్యాసం, సృజనాత్మకత, ఆవిష్కరణతో కూడిన అనుభవం కోసం తమను సంప్రదించాలని చెప్పారు. ఎక్స్‌పోలో ప్రతిభ కలిగిన ప్రదర్శనకు ఆకర్షణీయమైన బహుతులు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఐఓటీ విభాగాధిపతి డాక్టర్ పి.సత్యనారాయణతో కలసి ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ కె.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వర్సిటీ ప్రో వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు తదితరులు

బయోటెక్నాలజీపై జాతీయ సదస్సు ప్రారంభం

యూనివర్సిటీలో బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బయో రియాక్టర్ డిజైన్, ఆపరేషన్స్ ఫర్ బయోప్రాసెస్ ఇంటెన్సిఫికేషన్ అనే అంశంపై గురువారం జాతీయ సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సులో బెంగళూరుకు చెందిన బయోకాన్ అకాడమీలోని అకడమిక్ డీన్ ఎస్.ఎస్. ఈశ్వరన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెరుగైన మాస్ ట్రాన్స్‌ఫర్, ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్‌తో సహా అధునాతన డిజైన్ వ్యూహాల ద్వారా బయో ప్రాసెస్ సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారించామన్నారు. జలంధర్ ఎన్‌ఐటీ నుంచి డాక్టర్ ప్రీతమ్ కుమార్, కేఎల్‌యూ బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి. ప్రవీణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ కె.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్‌ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.


ముగిసిన ఆర్కిటెక్చర్ అంతర్జాతీయ సదస్సు

వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు గురువారం ఘనంగా ముగిసింది. ఫ్యూచర్ ఎక్స్‌రీ ఇమాజనింగ్ స్పేసెస్, రీ డిఫైనింగ్ ఫ్యూచర్ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు గుజరాత్, అహ్మదాబాద్‌లోని ఎమెరిటస్, పీపీ సావని యూనివర్సిటీ ఆర్కిటెక్ట్ ఆచార్య గిరీష్ మిస్త్రీ, కొచ్చి నుంచి బిల్డింగ్ సైంటిస్ట్, టెడెక్స్ స్పీకర్ సదస్సుకు కెఎల్‌యూ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ఆర్కిటెక్ట్ ప్రియాజాన్సన్ అధ్యక్షత వహించారు. అనంతరం మాగజైన్ ట్రోవ్ 2025ను ఆవిష్కరణ చేశారు.

సీఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని శాంతిపేటలో దళితులపై దాడి చేసిన సీఐ రవీంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శాంతిపేటలో గురువారం రాత్రి దళిత బహుజన బృందం సభ్యులు కాలనీ వాసులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న సీఐ రవీంద్రబాబు స్థానిక మహిళలను అసభ్యకరంగా దూషించడం, అఖిల్‌బాబుపై రివాల్వర్‌తో తల పగలకొట్టడం వంటి చర్యలను దళిత బహుజన ఫ్రంట్ ఖండిస్తుందన్నారు. ఇటువంటి అనాగరిక చర్యలు చేసినందుకు సీఐపై ఎస్సీ,ఎస్టీ కేసునమోదుచేయాలన్నారు. పైదళితులపైనే తప్పుడు కేసులు పెట్టడం రాజకీయ కుట్రగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేసారు. కమ్యూనిటీ స్థలాన్ని కబ్జాచేయబోయిన జి. చిన్నికుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై శుక్రవారం ఎస్పీకి, ఎస్టీ,ఎస్సీ కమిషన్‌కు, జాతీయ మానవహక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.


టోల్ చార్జీల భారాన్ని తగ్గించాలి



టోల్ చార్జీల భారాన్ని తగ్గించాలని కోరుతున్న డ్రైవర్లు

మంగళగిరి టౌన్: టోల్ చార్జీల భారాన్ని తగ్గించాలని శ్రీ లక్ష్మి నరసింహ టాటా మ్యాజిక్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని రాయల్ గ్యాస్ కంపెనీ రోడ్డు వద్ద ఉన్న స్టాండ్‌లో గురువారం నాయకులు మాట్లాడారు. మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 200 కుటుంబాల వ్యక్తులు టాటా మ్యాజిక్ వాహనం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. కాజ టోల్‌గేటు టాటా మ్యాజిక్‌లకు నెలవారి పాసులు తొలగించి, ప్రతి ట్రిప్పు డబ్బులు చెల్లించే విధానం ప్రవేశపెట్టి చార్జీలు పెంచడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గత 12 సంవత్సరాల నుంచి నెలకు రూ. 150 టోల్‌చార్జీలు చెల్లించేవాళ్లమని, గతేడాది నవంబర్ నుంచి నెలవారి విధానాన్ని రద్దు చేశారని చెప్పారు. ప్రజాప్రతినిధులు అధికారుల తమ సమస్యను పరిష్కరించి, పాత విధానంలో టోల్ చార్జీలు వసూలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి హనుమంతరావు, నాయకులు రాము, శ్రీను, రామకృష్ణ, సాయికుమార్, ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రాజధాని పెన్షన్ పునరుద్ధరించాలి



మల్కాపురం(తాడికొండ): అసెంబ్లీ, సచివాలయంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు రాజధాని సామాజిక పెన్షన్ పునరుద్ధరించి, ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని సీఐటీయూ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు అన్నారు. తుళ్లూరు మండలం మల్కాపురంలో అసెంబ్లీ, సచివాలయ పారిశుద్ధ్య కార్మికుల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులకు జీతం రూ.21 వేలకు పెంచాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు పారిశుద్ధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



దుగ్గిరాల: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. పెనుమూలి గ్రామంలో గురువారం మదీనా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాసదీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించారు. అన్ని మతాలు చేప్పేది ఒక్కటేనని, మనుషులంతా సోదర బావంతో ఉండాలన్నారు. జానీబాషా, కరిముల్లా, జానీ, అబ్దుల్ నజీర్, మాబు సుభాని, మస్తాన్, కల్యాణ్, శరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మేడికొండూరు : పేరేచర్ల పెద్ద మసీదులో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కేబీవై యూత్ అండ్ మసీద్ యూత్ ఆధ్వర్యంలో విందులో ముస్లిం సోదరులు ఐక్యత భావంతో పాల్గొన్నారు.

రుణ మేళాకు 281 మంది హాజరు

మేడికొండూరు : మండల కేంద్రంలో గురువారం బీసీ రుణ మేళా జరిగింది. బీసీ, కమ్మ, రెడ్డి కాపు, బ్రాహ్మణ, వైశ్య, మేదర కార్పొరేషన్ల రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 488 మందిలో 281 మంది హాజరయ్యారు. మండలంలో పలు గ్రామాల్లోని బ్యాంక్‌లు బ్రాంచ్ మేనేజర్లు దరఖాస్తులను పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓరి పాటిబండ్ల పూర్ణ శంకరరావు పాల్గొన్నారు.

నేడు తాడికొండలో రుణ మేళా

తాడికొండ: వివిధ కార్పోరేషన్‌లకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం రుణ మేళా జరగనుందని ఎంపీడీవో కె.సమతావాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరగనున్న ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు హాజరు కావాలన్నారు. బ్యాంకర్లతో ముఖా ముఖి ఉంటుందన్నారు.

తాగుబోతుల ఆగడాలను భరించలేకున్నాం



ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి సమస్యను వివరిస్తున్న మహిళలు

- ఇళ్ల మధ్య వైన్ షాపులతో ప్రశాంతంగా జీవించలేకున్నాం
- కదిలిన మహిళా లోకం.. వివిధ పార్టీల నేతలకు నేరుగా వినతి

తాడేపల్లి రూరల్ : ఉండవల్లి సెంటర్‌కు చెందిన కొంతమంది మహిళలు మద్యం బాబుల ఆగడాలు తట్టుకోలేక గురువారం భారీగా వివిధ రాజకీయ పార్టీల నాయకులను కలసి వినతిపత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ సెంట్రల్ కార్యాలయంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని వారు కలిశారు. ఈ సందర్భంగా పలురువు మహిళలు మాట్లాడుతూ తమ నివాసాల మధ్య మద్యం సేవిస్తున్నారని, దాంతో పాటు అక్కడే మల, మూత్రాలు విసర్జిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీపీఎం, సీపీఐ, టీడీపీ, జనసేన, బీజేపీ పట్టణ అధ్యక్షులకు, ఇతర నాయకులకు మహిళలు వినతిప్రతాలు అందజేశారు. అనంతరం తాడేపల్లి పోలీస్‌స్టేషన్, మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేసినట్లు మహిళలు తెలిపారు. ఈ సందర్భంగా లేళ్ల అప్పిరెడ్డి స్పందిస్తూ.. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్యం అమ్మకాలను తగ్గించాలనే ఉద్దేశంతో ఊళ్లకు చివరగా మద్యం షాపులకు అనుమతులు ఇచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో మద్యం అమ్మకాలు ఎక్కువ అయ్యాయని, ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేయడంతో మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మహిళలకు హామీ ఇచ్చారు.

డబ్బుకోసం.. విటుడిని ఉరికించి కొట్టారు



విటుడిని వెంబడిస్తున్న మహిళ, మరో వ్యక్తి

తాడేపల్లి రూరల్: వ్యభిచారంలో నయా దందా వెలుగు చూసింది. వలపు వల వేసి, ఒంటరిగా వచ్చిన విటులను దోచుకుంటున్నారు. తాము అడిగినంత ఇవ్వకుంటే ఇదిగో ఇలా పబ్లిక్‌గా ఉరికించి..ఊరంతా తిప్పి తిప్పి కొడుతున్నారు. పాపం ఈ విషయం పోలీసులకు చెప్పుకుంటే సిగ్గుచేటని బాధిత విటుడు కూడా జేబు గుల్ల అయినా..ఒళ్లు హూనమైనా గప్‌చుప్‌గా ఉండిపోయాడు. అసలు విషయానికొస్తే.. సేకరించిన వివరాల మేరకు.. విజయవాడ సిటీ బస్టాండ్ వద్ద ఉన్న ఓ యువకుడి వద్దకు ఏపీ 39 యూజే 5348 నంబరు గల ఆటోలో ఇద్దరు యువకులు వచ్చారు. అమ్మాయి ఉంది.. కావాలా అని అడిగారు. అక్కడ రూ.500కు బేరం మాట్లాడుకుని విటుడిని, అక్కడే ఉన్న మహిళను ఎక్కించుకుని ప్రకాశం బ్యారేజ్ మీదుగా ఉండవల్లి సెంటర్, అమరావతి కరకట్ట వెంబడి ఉన్న పంట పొలాలకు తీసుకెళ్లారు. పని అనంతరం ఆ విటుడు సదరు మహిళకు ముందుగా అనుకున్న నగదు ఇచ్చేశాడు. తిరిగి ఆటో ఎక్కి విజయవాడలో దించమని తనను తీసుకొచ్చిన వారిని కోరాడు. వారు టీ తాగుదామని ఉండవల్లి సెంటర్‌కు అతనిని తీసుకువచ్చారు. ఆటోకు రూ.1500లు అయ్యిందని, డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేశారు. దీంతో ఆ యువకుడు నిరాకరించడంతో అక్కడ జరిగిన ఘర్షణ జరిగింది. విటుడిని మహిళ, ఇద్దరు వ్యక్తులు చితకబాదడంతో అతను పీడబ్ల్యూడీ వర్క్ షాపులోని నివాసాల్లోకి పరుగులు పెట్టాడు. అయినా అతనిని వారు వదల్లేదు. వెంబడించి మరీ కొట్టి.. అతడి జేబులోని డబ్బులు లాక్కుని వెళ్లిపోయారు. సదరు విటుడు మాత్రం చేసింది చెప్పుకోలేక.. పోలీసులకు ఏమని ఫిర్యాదు చేయమంటారు అని అంటూ అక్కడి నుంచి గమ్ముగా వెళ్లిపోయాడు. గురువారం ఉదయం 6 గంటలకు ఉండవల్లి సెంటర్‌లో ఈ సీన్‌ను స్థానికులు చూసి, ముక్కున వేలేసుకున్నారు.

'ప్రైవేటు డిగ్రీ కళాశాలల' అసోసియేషన్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నగర పరిధిలోని వైష్ణవి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది వివిధ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. 18 సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం నూతన అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, అధ్యక్షులుగా వై. రమణాజీ, ప్రధాన కార్యదర్శిగా జి. రాజ్ కుమార్, ట్రెజరర్‌గా రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా శ్యామ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వీవీ ప్రసాద్, డి.శ్రీనివాసులు, వివిధ జిల్లాల నుంచి నాయకులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

it is informed to the General Public that the below schedule property is exclusively belongs to my client Sri Prodduturi Veerabrahmam S/o Venkatarao Kannegandla village Pedakurapadu Mandal Guntur District who purchased the below schedule property from 1. Sarvani Capital Link LLP rep.by its partner Vadith Tapadia S/o Venupopal Tapadia and 2.Marupudi Surendranath S/o Sivarama krishnaiah by virtue of registered sale deed dt **30-06-2021** vide regd document No. **4406/2021** registered at Joint Sub-Registrar Mangalagiri. But unfortunately my client had lost his original document when he came to Mangalagiri on **08-03-2025** to meet to document writer in order to sell his property and thereafter he searched in all the areas including his village as well as in and around of **RTC** bus stand, but unfortunately not yet traced so far.

Therefore. I request the general public on behalf of my client Sri Prodduturi Veerabrahmam if any body found or received the original registered sale deed dt. **30-06-2021** vide document No. **4406/2021** lost by my client. please handed it over to his counsel or directly to my client and my client will provide gift in any kind or cash, but I further request the general public if any body misuse the same my client will take appropriate legal steps against any fraudsters who will responsible for all legal consequences

SCHEDULE OF PROPERTY

Guntur District- Mangalagiri Sub-District-Tadepalli Mandal-Gundimeda village in Sy No.216. 221, 233/C. 233/B1 & 233/B1B to an extent of Ac.17-63 cents out of which residential layout vide LP No. 61/2019/1168/PCRDA/DPMS in Plot No.194 admeasuring 150 Sq yards or 125.41 sq.meters bounded by **East:** Utility Area, -30 ft **South:** Plot No.193, -45 ft. **West:** 12 meters road -30 ft and **North:** Plot No.195 45 ft In between this boundary 150 sq yards

V. ESWARAIAH CHOWDARY, B.A; B.L
Advocate (8202)- High Court
Office & Residence: Flat No.208, Yaganti Park, Hailand Road, Chinakakani Mangalagiri Mandal, Guntur Dist. Cell: +91-9701226009

Cent Bank Home Finance Limited
Subsidiary of Central Bank of India

అనుబంధం -IV-A (రూల్ 8(6))
టెండరు కమ్ వేలం అమ్మకం ప్రకటన - 28.04.2025

[illegible]

రుణగ్రహీత / సహ-రుణగ్రహీత / హామీదారు పేరు & LAN No	ఆస్తుల వివరాలు	డిమాండ్ నోటీసు / స్వాధీనత తేదీ	రిజర్వు ధర / బయానా 10 % (రూ.)	డిమాండ్ నోటీసు తేదీ నాటికి బకాయి మొత్తం (రూ.)
[illegible] LAN No : 02504010001052	[illegible]	25.09.2024	78,50,000/-	62,04,917/- [illegible]
		06.12.2024 [illegible] 17.01.2025 [illegible]	7,85,000/-	

[illegible]

ప్రదేశం : విజయవాడ, తేది : 26.03.2025

బ్రాంచ్ ఆఫీస్ : 59A-21-8, [illegible]